నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 1 మార్చి 2025 | MEDAK

ఇష్టం వచ్చినప్పుడు రిజిస్ట్రేషన్లు?

- కంప్యూటర్ ఆపరేటర్ సెలవులో ఉంటే రిజిస్ట్రేషన్లు బంద్
- అవస్థలు పడుతున్న అమ్మకం, కొనుగోలుదారులు
- పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మునిపల్లి తహసీల్ ఎదుట రిజిస్ట్రేషన్ల కోసం పడిగాపులు కాస్తున్న జనం

మునిపల్లి, ఫిబ్రవరి 28: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూములు కొనుగోలు చేసుకునే వారు ఒక్కరోజు ముందు స్లాట్ బుక్ చేసుకుంటే చాలు.. తెల్లారి రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యేవి... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మకందారులు, కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసే కంప్యూటర్ ఆపరేటర్ సెలవులో ఉంటే చాలు ఆ రోజు రిజిస్ట్రేషన్లు లేనట్లే. మరో వ్యక్తిని ఏర్పాటు చేయకుండా అధికారులు ఇటు రైతులను, అటు కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సోమవారం నుంచి మండలంలో ఒక్క రిజిస్ట్రేషన్ చేయలేదు. తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరుగకపోయినా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈరోజైనా రిజిస్ట్రేషన్లు జరిగేనా...

మునిపల్లిలో శనివారమైనా రిజిస్ట్రేషన్లు ఉంటాయా, ఉండవా అని ఎదురుచూస్తున్నారు. నిత్యం స్లాట్స్ బుక్ చేస్తున్నారు. టేట్స్ మారుస్తున్నారు తప్ప రిజిస్ట్రేషన్లు మాత్రం జరగటం లేదు. మునిపల్లి ఉప తహసీల్దార్ కృపానందంను వివరణ కోరగా ఎమ్మెల్సీ ఎన్నికల డ్యూటీలో భాగంగా గురువారం వరకు రిజిస్ట్రేషన్లు చేయలేకపోయాం, శనివారం కంప్యూటర్ ఆపరేటర్ వస్తాడా లేదా అనే విషయం తెలుసుకునేందుకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని క్రయవిక్రయదారులు కోరుతున్నారు.

మృతదేహంతో ఆందోళన

- గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట కొండపాక మండలం ఎర్రవల్లి గ్రామస్తుల నిరసన
- ఆర్అండ్ఆర్ కాలనీకి శ్మశానవాటిక కేటాయించాలని డిమాండ్

గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ముస్లింలు

గజ్వేల్, ఫిబ్రవరి 28: దహన సంస్కారాలు చేసేందుకు శ్మశానవాటిక (కబ్రస్థాన్) లేకపోవడంతో ఆగ్రహించిన ఎర్రవల్లి గ్రామస్తులు శుక్రవారం మృతదేహంతో ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకెళితే.. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మల్లన్నసాగర్ ముంపు గ్రామం ఎర్రవల్లి గ్రామస్తులు గజ్వేల్‌లోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఉంటున్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలో వారికి శ్మశాన వాటిక స్థలాన్ని అధికారులు నేటికీ కేటాయించలేదు. హిందువులు కాలనీ సమీపంలో దహనసంస్కారాలు నిర్వహిస్తుండగా, ముస్లింలు మాత్రం అలా చేయలేకపోతున్నారు. తప్పనిసరిగా ముస్లింలు మసీద్ సమీపంలోని కబ్రస్థాన్‌లోనే కార్యక్రమాలు చేయాల్సి ఉంటుంది. దహన సంస్కారాలు చేపట్టేందుకు కబ్రస్థాన్ లేకపోవడంతో మహిళా మృతదేహంతో గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. చివరకు గజ్వేల్ మసీద్ కమిటీ అధ్యక్షుడు మతిన్ తాత్కాలిక పరిష్కారం చూపడంతో దహన సంస్కారాలను గజ్వేల్ కబ్రస్థాన్‌లో నిర్వహించారు.

కబ్రస్థాన్‌కు స్థలం కేటాయించాలి

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు చెందిన ముస్లింలకు కబ్రస్థాన్ కోసం రెవెన్యూ అధికారులు తక్షణమే స్థలాన్ని కేటాయించాలని ఎర్రవల్లి గ్రామ ముస్లిం హైదర్‌పటేల్, అంజద్, ఉస్మాన్, షాదుల్లా కోరారు. గతంలో కలెక్టర్, ఆర్డీవోల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా నేటికీ పరిష్కారం చూపడం లేదని మండిపడ్డారు. అధికారుల తీరుకు నిరసనగానే తప్పనిసరి పరిస్థితుల్లో మృతదేహంతో ఆర్డీవో కార్యాలయానికి వచ్చామన్నారు. అయినా శాశ్వత పరిష్కారాన్ని అధికారులు చూపించలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్థలాన్ని కేటాయించాలని కోరారు.


మదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి

మదన్‌రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ): గుండె శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా మదన్‌రెడ్డి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పౌల్ట్రీ రైతులను ప్రోత్సహించాలి

పౌల్ట్రీ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

- సోషల్ మీడియాలో వచ్చే అపోహలు నమ్మవద్దు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రొటీన్ ఇచ్చేది చికెన్, కోడిగుడ్డు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో ఉచిత చికెన్, ఎగ్ మేళాకు భారీ స్పందన

సిద్దిపేట అర్బన్: చికెన్ తింటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 28: పౌల్ట్రీ రైతులను ప్రోత్సహించాలని కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవటం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో సిద్దిపేట జిల్లా పౌల్ట్రీ రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చికెన్, ఎగ్ మేళాలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో సృష్టించే అపోహలు నమ్మవద్దని, బాగా ఉడకపెట్టి తింటే ఎలాంటి వైరస్ సోకదన్నారు. 70 డిగ్రీల వరకు ఉడకపెడితే ఎలాంటి వైరస్ ఉండదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిందన్నారు. గతంలో అపోహలు వస్తే కేసీఆర్‌తో పాటు ప్రజాప్రతినిధులంతా చికెన్ తిని అపోహలను దూరం చేసి ప్రజలకు నమ్మకం కల్పించామన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రొటీన్ ఇచ్చేది చికెన్, కోడిగుడ్డు మాత్రమే అన్నారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పౌల్ట్రీ సిద్దిపేట జిల్లాలోనే ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పౌల్ట్రీ రైతులకు మక్కలు, విద్యుత్ సబ్సిడీ ఇచ్చామని హరీశ్‌రావు చెప్పారు.

చికెన్‌ను సరిగ్గా ఉడికిస్తే హాని జరగదు

– నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 28: చికెన్‌ను 70 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికించి తింటే ఎలాంటి హాని జరగదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో వెన్‌కాబ్ కంపెనీకి చెందిన గోల్డెన్ చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వాహకుడు, బీఆర్ఎస్ నాయకుడు షేక్ హుస్సేన్ చికెన్ మేళా నిర్వహించారు. చికెన్‌పై అపోహలను తొలిగించడానికి ఉచితంగా చికెన్, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిందని, చికెన్ తింటే హాని చేకూరుతుందని ప్రజలు అపోహ చెందుతున్నారని గుర్తుచేశారు. చికెన్‌ను 70 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడకబెట్టి తిన్నట్లయితే ఎలాంటి హాని జరగదని ప్రజలకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నాయకులు చికెన్ తిని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయీముద్దీన్, బీఆర్ఎస్ నాయకులు జితేందర్‌రెడ్డి, సేనాధిపతి, రాకేశ్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సిద్దిపేట అర్బన్: ఉచిత చికెన్, ఎగ్ మేళాకు బారులుదీరిన ప్రజలు

వ్యవసాయాధికారి సస్పెన్షన్

హుస్నాబాద్, ఫిబ్రవరి 28: సీసీఐ పత్తి కొనుగోళ్లలో నకిలీ పర్మిట్లు, ఫోర్జరీ సంతకాల విషయంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల వ్యవసాయాధికారి నాగరాజురెడ్డిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. హుస్నాబాద్‌లోని సీసీఐ పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో పాటు మార్కెటింగ్ శాఖ అధికారి విచారణ చేపట్టారు. మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న నాగరాజురెడ్డి ఏఈవోల సంతకాలను ఫోర్జరీ చేసి పంటలు సాగు చేయని రైతుల పేర్లతో పత్తి విక్రయాలు జరిపేలా అనుమతులు ఇచ్చాడని, అక్రమంగా పర్మిట్లు ఇచ్చాడని విచారణలో తేలింది. వందలాది క్వింటాళ్ల పత్తి విక్రయాలు అక్రమంగా జరగ్గా లక్షలాది రూపాయల కుంభకోణం చోటు చేసుకుంది. విచారణ సమాచారాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరికి సమర్పించగా, ఆయన వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ గోపీ ఐఏఎస్‌కు పంపారు. ఏవో నాగరాజురెడ్డిని సస్పెండ్ చేయడంతో పాటు తదుపరి విచారణకు కమిషనర్ ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు.

తెల్లారితే కరెంట్ కట్

- 45 రోజులుగా ఇదే పరిస్థితి
- సమస్య పరిష్కరించాలని మెదక్ జిల్లా కర్నాల్‌పల్లి గ్రామస్తుల ఆందోళన
- విద్యుత్ అధికారులు స్పందించక పోవడంతో సబ్ స్టేషన్ ముట్టడి

చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చేగుంట, ఫిబ్రవరి 28: మెదక్ జిల్లా చేగుంట మండలంలోని కర్నాల్‌పల్లిలో తెల్లారితే కరెంట్ కట్. 45 రోజులుగా అదే పరిస్థితి... సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులను కోరితే స్పందించకపోవడంతో శుక్రవారం కర్నాల్‌పల్లి గ్రామస్తులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టారు. కర్నాల్‌పల్లి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై సగానికి పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 45 రోజుల నుంచి రోజు ఉదయం కరెంట్ పోతుండడంతో ఇబ్బందిగా మారింది. ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లే సమయంలో ఎక్కువ విద్యుత్ వాడకం వల్ల కరెంట్ ట్రిప్ అవుతుందని, గ్రామస్తులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదని ఆరోపించారు. రోజూ తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి తెగిపోయిన విద్యుత్ వైర్లను సరిచేసి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఏతః 20 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ పంపినా దానిని బిగించలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏతః భారత్‌ను వివరణ కోరగా కర్నాల్‌పల్లిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బంది ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఉదయం విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండడం, ఓవర్ లోడ్ కారణంగా సరఫరాలో అంతరాయం కలుగుతుందని, రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సైన్స్‌తో సమస్యలు పరిష్కారం

- పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త, భారత్ బయోటెక్ సీఎండీ డాక్టర్ కృష్ణ ఎల్లా
- సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఘనంగా సైన్స్ దినోత్సవం

ఏయూఆర్‌టీఐని ప్రారంభిస్తున్న డాక్టర్ కృష్ణ ఎల్లా

హాజరైన విద్యార్థులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 28: సైన్స్‌లో సరైన పరిశోధనలు జరిగి, సైన్స్‌ను సరిగ్గా వినియోగించకుంటే మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపగలదని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త, భారత్ బయోటెక్ సీఎండీ డాక్టర్ కృష్ణ ఎల్లా అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, గీతం ఛేంజ్ మేకర్స్ సిరీస్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత్ బయోటెక్‌ను స్థాపించడం నుంచి కోవాక్సిన్, ట్రైప్పాన్ టీసీవీ, రోటావాక్ వంటి సంచలనాత్మక వ్యాక్సిన్ల అభివృద్ధి వరకు తన ప్రయాణాన్ని వివరించారు. కేవలం ఇద్దరు ఉద్యోగులతో ప్రారంభమైన భారత్ బయోటెక్ ప్రయాణం, ప్రస్తుతం నాలుగువేల మంది బృందానికి ఎదిగిందని తెలిపారు. క్లినికల్ పరిశోధన ప్రాముఖ్యత, సమస్య పరిష్కారం గురించి వివరించారు. కాలానుగుణంగా నూతన ఆవిష్కరణలు అవసరం అని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సత్తాచాటితే దేశాన్ని మరింత వృద్ధి పథంలో నడపవచ్చని సూచించారు. ఆవిష్కరణల్లో మనం మరింత పురోగమించాలని, శాస్త్రీయ జ్ఞాన సంపదను సరిగ్గా వినియోగించుకోవాలని కోరారు. గీతం వర్సిటీ ఎంఐటీ వంటి ప్రఖ్యాత సంస్థలకు సరి సమానమని డాక్టర్ ఎల్లా పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలు తీర్చేలా విద్యాసంస్థల్లో ప్రాజెక్టులు చేపట్టాలంటూ గీతం పరిశోధకులకు ఆయన పిలుపునిచ్చారు. గీతం హైదరాబాద్‌లో నెలకొల్పిన మల్టీడిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్స్‌షనల్ ఇనిషియేటివ్స్ (ఎంయూఆర్‌టీఐ)ని డాక్టర్ ఎల్లా ప్రారంభించారు. ఈ అత్యాధునిక పరిశోధనా కేంద్రం ఇంటర్‌డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించడం, ముఖ్యమైన ప్రాంతీయ, జాతీయ, ప్రపంచ సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు గీతం ప్రతినిధులు తెలిపారు. అనంతరం గీతం సంస్థల అధ్యక్షుడు శ్రీభరత్, గీతం చాన్సలర్ డాక్టర్ వీరేందర్ సింగ్ చౌహాన్ డాక్టర్ కృష్ణ ఎల్లాను సత్కరించారు. ఐఐసీటీ పూర్వ డైరెక్టర్, గీతం విశిష్ట ఆచార్యులు డాక్టర్ శ్రీహరి చంద్రశేఖర్ అతిథిని పరిచయం చేసి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో గీతం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా బతుకులు ఆగం చేయొద్దు

- ఎంపీ రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందజేసిన జేఏసీ నాయకులు
- 24వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు
- రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి... మా సమస్యను పరిష్కరించాలి
- ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు అనుమతులు ఉపసంహరించుకోవాలి

ప్యారానగర్ డంపింగ్ యార్డు హఠావో... గుమ్మడిదల బచావో: జేఏసీ నాయకుల డిమాండ్

మెదక్ ఎంపీని కలిసి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 28: డంపింగ్ యార్డుతో ప్రజల పచ్చని బతుకులు ఆగం చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇక్కడి నుంచి డంపింగ్ యార్డు హఠావో– గుమ్మడిదల బచావో నినాదాలతో రిలే నిరాహార దీక్ష మార్మోగింది. శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గుమ్మడిదల జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో నవజ్యోతి మాల యువజన సంఘం సభ్యులు 18వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 24వ రోజు రిలే నిరాహార దీక్షలో అంబేద్కర్ సంఘం సభ్యులు కూర్చున్నారు. దీక్షలో కూర్చున్నవారికి మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, జేఏసీ నాయకుడు గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి పూలదండలు వేసి స్వాగతించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 24 రోజులుగా డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఇచ్చిన అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళనలు ఆగవని హెచ్చరించారు. ఇక్కడి ప్రజల మనోభావాలను దెబ్బతీయకుండా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర, రాష్ట్ర అటవీ శాఖ, పీసీబీ, పర్యావరణ శాఖ స్పందించి వెంటనే డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేసి ఇక్కడి ప్రజల క్షేమాన్ని కోరుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు యాదవ్, నల్తూరు యాదగిరి, రమేశ్, కుమ్మరి ఆంజనేయులు, ఫయాజ్ షరీఫ్, రామకృష్ణ, సురేశ్, ఆకుల సత్యనారాయణ, తేలు నర్సింహ, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

ఎంపీ రఘునందన్‌రావుకు వినతి

డంపింగ్ యార్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకునేలా కృషి చేయాలని జేఏసీ నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ తదితర గ్రామాలకు చెందిన జేఏసీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన డంపింగ్ యార్డు వల్ల ఇక్కడి గ్రామాల ప్రజల బతుకులు ఆగమైతాయని ఎంపీకి విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. చట్టప్రకారం డంపింగ్ యార్డును ఆపవచ్చని సూచించారు. దీనికి సంబంధించిన పలు సూచనలు ఎంపీ జేఏసీ నాయకులకు వివరించారు. శాంతియుతంగా ఆందోళనలు చేయాలని సూచించారు. సర్కారు, పోలీసులు కవ్వింపు చర్యలకు పాల్పడాలని యత్నించినా శాంతియుత మార్గంలో నిరసనలు చేయాలని సూచించారు. అటవీశాఖ అధికారులతో ఎంపీ ఫోన్‌లో సంభాషించారు. వచ్చే సోమవారం రాష్ట్ర అటవీ శాఖ కార్యాలయంలో కలిసి ఇక్కడి ప్రజలు ఇబ్బందులు, పర్యావరణ సమస్యలు, గాలి, నీరు కలుషితమయ్యే పరిస్థితులను వివరించనున్నట్లు ఎంపీ తెలిపారు. తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రామకృష్ణ, సురేశ్, కావలి ఐలయ్య, చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్, నాగేందర్ గౌడ్, నర్సింగ్‌రావు, ప్రతాప్‌రెడ్డి, జయశంకర్ గౌడ్, రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, మాజీసర్పంచ్ శంకర్, రాంరెడ్డి, రాజిరెడ్డి, కిరణ్‌కుమార్ శర్మ, యాదగిరి, కరుణాకర్, సత్యనారాయణ ఉన్నారు.


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నవజ్యోతి మాల సంఘం సభ్యులు, జేఏసీ నాయకులు

రిలే నిరాహార దీక్షలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

గుమ్మడిదలలో పూజలు చేస్తున్న మహిళా జేఏసీ నాయకులు

డంపింగ్ యార్డు రద్దు చేయించు వేంకటేశ్వరా..

ప్యారానగర్ డంపింగ్ యార్డును రద్దు చేయించు వేంకటేశ్వరా అంటూ మహిళా జేఏసీ నాయకులు పూజలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీదేవిభూదేవి సమేత కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా మహిళా జేఏసీ నాయకులు కుంకుమార్చనలు, పూజలు చేశారు. 24 రోజులుగా చేస్తున్న ఆందోళనలు, నిరసనలకు రాష్ట్ర ప్రభుత్వం చలించడం లేదని.. స్వామి... రాష్ట్ర పాలకుల మనస్సును మార్చండి అంటూ మహిళా జేఏసీ నాయకులు పూజలు చేశారు.

ఎల్లారెడ్డిపేటలో ట్యాంకర్ ద్వారా నీటిని నింపుకొంటున్న గ్రామస్తులు

తాగునీటికి కటకట

- శివరాత్రి రోజు కూడా నీటి కోసం తల్లడిల్లిన ఎల్లారెడ్డిపేట ప్రజలు
- 15 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాక అవస్థలు

తొగుట, ఫిబ్రవరి 28: మండుటెండల్లో తాగడానికి నీళ్లు లేక ప్రజలు తల్లడిల్లుతున్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేటలో 15 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎండల తీవ్రత పెరుగుతుంటే తాగడానికి నీళ్లు ఇవ్వకుంటే ఎలా అని ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. శివరాత్రి పండుగ రోజు శివపార్వతులకు పూజలు చేద్దామన్నా మిషన్ భగీరథ నీళ్లు రాక గ్రామస్తులు నానాఅవస్థలు పడ్డారు. గ్రామస్తులు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారులకు పట్టడంలేదని మండిపడుతున్నారు. తాగునీటి కోసం విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారని విమర్శిస్తున్నారు. తాగునీటికి, ఇతర అవసరాల కోసం వ్యవసాయ బోరుబావుల నుంచి ట్యాంకర్లలో నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మిషన్ భగీరథ నీళ్లు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రుద్రారంలో నీళ్ల కోసం తండ్లాట

మిరుదొడ్డి(అక్బర్‌పేట–భూంపల్లి), ఫిబ్రవరి 28: ఎండాకాలం ప్రారంభ దశలోనే గ్రామాల్లో తాగునీటి తండ్లాట మొదలైంది. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలం రుద్రారంలో వారం రోజులుగా తాగునీటి ఎద్దడితో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని 1వ వార్డులో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకుకు నీళ్లు రాకపోవడంతో 1, 2, 11, 12 వార్డుల్లో వారం రోజుల నుంచి తాగునీళ్ల కోసం పడరాని పట్లు పడుతున్నామని మాజీ వార్డుమెంబర్ వెంకట్‌తో ఆయా వార్డుల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు అధికారులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2వ వార్డులోని మినీ ట్యాంకు వద్ద ఉన్న బోరుబావి నుంచి తాగునీటిని సైకిళ్లపై తీసుకెళ్లాల్సి వస్తుందని మండిపడుతున్నారు. ప్రభుత్వం, మిషన్ భగీరథ అధికారులు స్పందించి నీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరారు.

మిరుదొడ్డి: రుద్రారంలో 2వ వార్డులోని మినీ ట్యాంకు వద్ద నీళ్లు పడుతున్న వ్యక్తి